

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 | సంచిక : 12 | ఆగష్టు 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


పాలకొల్లు ....... 23-11-2008
మండపేట ....... 06-04-2009
చించినాడ ...... 11-03-2009
హైదరాబాద్ .... 07-07-2009
కైకలూరు ........ 30-06-2009



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-11-2008, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన శరీరం చనిపోవటంతో ఈ జీవుడి యొక్క యాత్ర ఆగదు. శరీరం చనిపోతే ఆ శరీరగతమైన యాత్ర ఆగిపోతుంది కాని జీవుడి యొక్క యాత్ర అలా కంటిన్యూ అవుతుంది. మనలో ఉన్న వాసనలు సంస్కారాలు అన్నీ కలిసి మరల కొత్త శరీరాన్ని తీసుకొనివస్తాయి, అదే పునర్జన్మ. పూర్వజన్మలు ఉన్నమాట నిజం, రాబోయే జన్మలు ఉన్న మాట నిజం, ఎవరైనా లేవు అంటే అది తెలియనితనం. దేవుడు ఉన్నాడా, లేడా అంటే మౌనం వహించిన బుద్ధుడు జన్మలు ఉన్నాయని చెప్పాడు. మనకు వర్షాకాలం తరువాత శీతాకాలం, శీతాకాలం తరువాత వేసవికాలం ఎలా వస్తున్నాయో అలాగే ఈ శరీరం చనిపోతే కొత్త శరీరాలు వస్తూ ఉంటాయి, అది ప్రకృతి. తన స్వరూపంలో ఉన్న శాంతి, ఆనందం వాడికి అనుభవం లోనికి వచ్చేవరకు వాడు ధనవంతుడైనా, పండితుడైనా, వాడికి అధికారం ఉన్నా, వాడు ఎంతటివాడైనా వాడికి పునర్జన్మలు ఆగవు. శరీరం వచ్చింది అంటే నాలుగు రోజులు వెనకోముందో చనిపోవటం ఖాయం. ఇంకో గంటలో చనిపోయేవాడు కూడా ప్రస్తుతానికి మనకు ఏమీ ఇబ్బంది లేదు అనుకొంటాడు, అదే మాయ. మనం భగవంతుడు చెప్పినమాటలు నమ్మము దానికి మన బుద్ధిలో ఉన్న దోషాలు కారణం. ఎన్నో జన్మలనుండి మనం సత్కర్మ నిష్కామంగా చేసుకొంటూవస్తేగాని మనకు భగవంతుడి పట్ల విశ్వాసం కలగదు. మనకు శరీరం గురించి తెలుసు, మనస్సు గురించి తెలుసు కాని అందరిలోను అంతర్యామిగా ఉన్న పరమాత్మకు సంబంధించిన ఎరుక మనకు లేదు. దేహం ఎలాగ ఉందో, మనస్సు

ఎలాగ ఉందో లోపల ఉన్న వస్తువు కూడా అలాగే ఉంటుంది అనుకుంటున్నాము. దేహానికి సంబంధించిన రోగాలు, చావులు, పుట్టుకలు, మనస్సుకు సంబంధించిన ఇష్టాలు, అయిష్టాలు వీటితో లోపలఉన్న వస్తువుకు ఏమీ సంబంధం లేదు కాని వీటిని తీసుకొని వెళ్ళి అందులో కలపటంవలన మనకు కన్ఫ్యూజన్ వచ్చేస్తోంది. లోపలఉన్న వస్తువు శరీరంలాగ ఉందేమో, మనస్సులాగ ఉందేమో అని ఇలా ఊహించుకోవటం వలన మనం సబ్జక్టు విన్నా క్లారిటీ రావటంలేదు. మనం ఊహించు కొన్నట్లుగా ఆ వస్తువు లేదు, అది ఎలా ఉండాలో అలాగ ఉంది. వస్తువు మనలోపలే ఉంది, అది శాంతిగా ఉంది, ఆనందంగా ఉంది, స్వతంత్రంగా ఉంది. మనం దానికోసం గుడులలో, గోపురాలలో, సమాజంలో ఇలా ఎక్కడో బయట వెతుకుచున్నాము దీనికి మన మనస్సు యొక్క చాపల్యం కారణం.

ధనవంతులు అందరూ మేము ధనవంతులము అనుకొంటారు. వారికి ధనం ఉంటే ప్రమాదంలేదు, నేను ధనవంతుడిని అనుకొంటే ప్రమాదం, ఏ జ్ఞాని కూడా నేను జ్ఞానిని అని అనుకోడు. అంటే అక్కడ దేహగతమైన నేను ఉండదు. అంటే అనుకొనేవాడు అక్కడ లేడు వాడు ఎప్పడోపోయాడు, వాడుపోతేగాని మనకు జ్ఞానం రాదు. మీలో ఎవరికైనా ధనం ఉంది అనుకోండి, ఉండనివ్వండి. నేను ధనవంతుడిని అని మీరు అనుకుంటే మీ బ్రెయిన్ నెమ్మదిగా పాయిజన్ అయిపోతుంది, మీరు చెడిపోతారు. భక్తిమార్గంలో చాలామంది ప్రయాణిస్తూ ఉంటారు. అందులో చాలాకొద్దిమంది మాత్రమే సిన్సియర్‌గా సాధన చేస్తూ ఉంటారు. అలా సిన్సియర్‌గా సాధన చేసే లక్షలాదిమందిలో ఎవరో ఒకరికో, ఇద్దరికో రియలైజేషన్ వస్తుందికాని రియలైజేషన్ పొందటం మీరు అనుకొన్నంత తేలికకాదు. వివేకానందుడు చదువుకొనే రోజులలో ఎప్పడైనా వచ్చి రామకృష్ణుడిదగ్గర కూర్చునేవాడు. ఒకరోజు వివేకానందుడు రామకృష్ణుడి దగ్గర కూర్చుని నవ్వుతున్నాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే బుల్లి వివేకానందుడు నవ్వుతున్నాడురా, మీరు అందరు నావంక చూడవద్దు, వాడి నవ్వును చూడండి. ఆ నవ్వు చాలా అందంగా ఉంది, స్వీట్‌గా ఉంది. మీలో ఎవ్వరూ అలాగ నవ్వలేరు. వాడి మనస్సులో ఏ కాంక్ష లేదు, లోకానికి సంబంధించిన ఏ గొడవ అక్కడలేదు అందుచేత ఆ నవ్వు అంత అందంగా ఉంది. అలా నవ్వటం మీకు సాధ్యం కాదు. వాడు పూర్వజన్మలో చేసిన కృషినిబట్టి అది వచ్చింది ఈ ఒక్క జన్మలో వచ్చింది కాదు అని చెప్పాడు. మీరు రియలైజేషన్ పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు అనుకోండి, ఆ ప్రయత్నం వెంటనే ఫలించకపోయినా దాని తాలుక ఫలితం వచ్చే జన్మలో మన కూడా వచ్చేస్తుంది, దాని ప్రభావం ఎప్పడో ఒకప్పడు ఉంటుంది. మనం ఈ ప్రపంచంలోనికి వచ్చి వెళ్ళిపోయామనే జాడకూడా ఇతరులకు తెలియవలసినపనిలేదు. మమ్మల్ని

ఇంట్లోవారు ప్రేమించటం లేదు, సమాజం ప్రేమించటంలేదు అని అంటారు, వారి ప్రేమ మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతాము, మనంతట మనం బతకాలి. లోపల ప్రేమలేనప్పడు, ఆప్యాయత లేనప్పడు పనిమనుషులకీ, ఇంట్లోవారికీ తేడాలేదు.

ఆత్మజ్ఞానం పొందాలి అంటే ముందు మనమీద మనకు విశ్వాసం ఉండాలి. బలహీనులకు, బద్ధకస్తులకు, ఆత్మవిశ్వాసం లేనివారికి ఆత్మజ్ఞానం కలుగదు. గుడిచుట్టూ తిరగటం, ఎక్కడరాయికనిపిస్తే అక్కడ రాళ్ళకు మొక్కటం ఇది జ్ఞానం కాదు. మీలో దేహభావన ఉన్నప్పడు గుడిలో ఉన్న దేవుడిని చూసిరండి. అంతర్యామిగా ఉన్న నారాయణుడిని దర్శించలేనప్పడు ఇలా గుడులచుట్టూ తిరగవలసిందే. మీకు ఎవరికైనా అశాంతివస్తే మీ కోడలును పట్టుకొని తిట్టేయకండి, అలా తిట్టటం వలన ఏమీ లాభం లేదు, ఎందుచేతనంటే వారివలన మనకు అశాంతి రావటంలేదు. చాలామంది మా అబ్బాయిలు చూడటంలేదు, మా కోడలు చూడటంలేదు అంటారు. వారు చూడటం లేదు, వీరు చూడటంలేదు అని అనటంవలన నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. అసలు వారిమీద ఆధారపడవలసిన పని ఏమిటి? నీకు ఆత్మబలం లేకపోవటంవలన, ఆత్మవిశ్వాసం లేకపోవటం వలన ఇది అంతా వస్తోంది. వారు చూడకపోతే ఏ గొడవలేదు, చూస్తేనే ఎక్కువ ప్రమాదం. వారు బాగాచూడటంవలన వారిమీద నీకు మమకారం పెరుగుతుంది. మమకారం పెరిగితే దేవుడిమీద భక్తి తగ్గిపోయి చివరిక్షణాలలో ఎవరిమీద మమకారం ఉందో వారే నీకు జ్ఞాపకం వస్తారు కాని దేవుడు జ్ఞాపకం రాడు.

భారతయుద్ధంలో రక్తం అలా ప్రవహిస్తూ ఉంటుంది. ఆ రక్తాన్ని చూసి ఇదంతా నా గురించేకదా, కౌరవులు రాజ్యం ఇవ్వనన్నారు, వదిలేసి ఉంటే ఈ యుద్ధం గొడవ లేదు. ఇంతమంది చనిపోవటం, ఈ రక్తప్రవాహం ఇదంతా నా గురించే జరిగింది అని ధర్మరాజుకు దుఃఖం వచ్చింది. ఈ దుఃఖం చల్లార్చటానికి కృష్ణుడు ధర్మరాజును భీష్ముడిదగ్గరకు తీసుకొని వెళతాడు. భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో నీతులు చెపుతాడు కాని ఆయనకు దుఃఖం తగ్గలేదు. ఎన్ని చెప్పినా నా మనస్సు ఆగటం లేదు అని ధర్మరాజు అంటాడు. అప్పడు భీష్ముడు ఏమన్నాడు అంటే నీ అశాంతికి కారణం ఇప్పడు నాకు అర్థమవుతోంది. ఈ యుద్ధానికి నువ్వే కారణం అనుకొంటున్నావు. నువ్వు కారణం కాకపోయినా నేనే కారణం అని నువ్వు అనుకోవటం వలన నీకు అశాంతి వస్తోంది, నీకు దుఃఖం వస్తోంది అని అప్పడు భీష్ముడు ఒక కథ చెప్పాడు. ఒక తల్లీకొడుకు నడిచివెళుతున్నారు, ఆ దారిలో పుట్టలు ఉన్నాయి, ఒక పాము ఆ పుట్ట పక్కనే తిరుగుతోంది. వీరిని చూసి అదిరి ఆ పాము వచ్చి కొడుకును కరిచింది, ఆ అబ్బాయి

చనిపోయాడు. మా అబ్బాయి చనిపోయాడు అని ఆ తల్లి ఏడుస్తూ ఉంటే ఒక బోయవాడు వచ్చి ఆ పుట్ట దగ్గరకి వెళ్ళి పామును పట్టుకొన్నాడు. అప్పుడు తల్లి దగ్గరకు వెళ్ళి మీ అబ్బాయిని ఈ పాము చంపింది, ఇప్పుడు నేను ఈ పామును చంపేస్తాను, మీకు దుఃఖం చల్లారిపోతుంది అని చెప్పాడు. పామును చంపటం వలన మా అబ్బాయి బతుకుతాడా అని తల్లి అడిగింది. మీ అబ్బాయి బతకడు మీకు కక్ష తీరినట్లు అవుతుంది అని చెప్పాడు. అప్పుడు ఆ తల్లి ఏమంది అంటే మా అబ్బాయి బతుకుతాడు అంటే ఆ పామును చంపవచ్చు, లేనిచో దానిని చంపటం వలన ప్రయోజనం లేదు, ఆ పామును వదిలేయండి అని చెప్పింది. అప్పుడు ఆ పాము ఏమంది అంటే నేను చంపాను అని మీరు అనుకొంటున్నారు, మీ అబ్బాయి నాకు ఏమీ అపకారం చేయలేదు. అందరినీ కరవటమే నా పనికాదు, మీ అబ్బాయి యొక్క మృత్యువే నన్ను ప్రేరేపించింది, దీనికి నేను కారణంకాదు అని చెప్పింది. తరువాత మృత్యువు వచ్చింది. నన్ను యమధర్మరాజు పంపాడు. వాడి టైము అయిపోయింది చంపేయమని చెప్పాడు. అందుచేత ఆ పామును ప్రోత్సహించాను ఇందులో నా తప్ప ఏమీ లేదు అని మృత్యువు అంటాడు. తరువాత యముడు వచ్చాడు. పాము ఏమో మృత్యువు కారణం అని చెప్పింది, మృత్యువు ఏమో యముడు కారణం అని చెప్పాడు. అబ్బాయి ప్రాణం తీయటం ఏమిటి, అమ్మ ప్రాణం తీయవచ్చును కదా. అబ్బాయి ప్రాణం తీయటానికి కారణం ఉంది. మీరు అనుకొనేది నిజంకాదు అని యముడు తల్లితో ఏమి చెప్పాడు అంటే మీ అబ్బాయి ప్రాణం పోవటానికి పాము కారణం కాదు, మృత్యువు కారణంకాదు, నేను కారణం కాదు, పూర్వజన్మలలో వాడు చేసిన కర్మను బట్టి వాడికి ఆయుర్ధాయం ఉంటుంది. వాడు చేసిన కర్మనుబట్టి వాడికి అంతే ఆయుర్ధాయం ఉంది. వాడు చనిపోవటానికి వాడి కర్మేకారణం అని యముడు చెప్పాడు. కౌరవులనందరినీ నేను చంపేసాను అని ధర్మరాజు అనుకొంటున్నాడు వారి కర్మవలన కౌరవులు చనిపోయారు కాని నీవల్లకాదు. నావల్ల చనిపోయారు అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తోంది అన్నాడు. ఈ కధతోటి ధర్మరాజు దుఃఖం ఆగిపోయింది.

మేము వారందరికి ఉపకారం చేసాము, వారు తిరిగి మాకు అపకారం చేస్తున్నారు ఏమిటి అని చాలామంది అంటారు. అది ప్రపంచం యొక్క స్వభావం. పిల్లలను జాగ్రత్తగా కష్టపడి పెంచితే తరువాత తల్లిని చంపిన పిల్లలు అనేక మంది ఉన్నారు. వాటిని చూసి ఆశ్చర్యపోకూడదు. అది ప్రపంచం యొక్క స్వభావం. మనలో ఉన్న గుణాలే ప్రపంచం కింద కనిపిస్తూ ఉంటుంది అంతకంటే ప్రపంచం అంటే ఏమీ లేదు. భగవంతుడు ఎక్కడైతే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడో అదే మన నిజమైన ఇల్లు, అక్కడకు చేరుకోండి, అక్కడకు

చేరితే ఆ ప్రపంచం గొడవ, చావుపుట్టుకల గొడవ ఏ గొడవ అక్కడ లేదు. మేము వారికి మంచి చేసాము, వీరికి మంచి చేసాము, వారు అపకారం చేస్తున్నారు అని ఇలా అనుకోవటం వేస్టు. ప్రపంచం అంటే అలాగే ఉంటుంది. మిమ్మల్ని ఫుట్‌బాల్ తన్నినట్లుగా ఈ ప్రపంచం తన్నేస్తూ ఉంటుంది. ఇవన్నీ మీరు సహనంగా తట్టుకోగలిగితే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మీరు ఏదైనా మంచి జరిగినప్పడు అదంతా మా తెలివితేటలు అనుకుంటారు. మీకు ఏదైనా చెడ్డ జరిగినప్పడు అది దేవుడే చేసాడు అనుకొంటున్నారు. మంచి జరిగినప్పడు దేవుడు కారణం అని అనుకోవటం లేదు మరి చెడ్డ జరిగినప్పడు దేవుడే కారణం అని ఎందుకు అనుకొంటున్నారు, దీనికి మన పాడుబుద్ధి కారణం. మీ దేహం మీదకు గొడవలు వస్తే రానివ్వండి, అవి వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. నువ్వు దేహం అనుకోవటం వలన, మనస్సు అనుకోవటం వలన ఇది అంతా వస్తోంది. బయట విపరీతంగా వర్షం వస్తోంది అనుకోండి, నువ్వు ఇంటిలో ఉంటే ఆ వర్షం నిన్ను ఏమి చేస్తుంది. అలాగే మీ హృదయంలో మీరు ఉంటే, మీ నిజమైన ఇంటిలో మీరు ఉంటే ఏవో గొడవలు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. గొడవలు రాకూడదు అని నీవు అనుకోవద్దు, ప్రారబ్దంలో ఉన్నవి వస్తాయి, వచ్చి అక్కడ కూర్చోవు, వెళ్ళిపోతాయి. మీ హృదయంలో మీరు ఉన్నప్పడు అవి ఏమీ మిమ్మల్ని తాకవు, వాటి ప్రభావం మీ మీద ఏమీ ఉండదు. భీష్ముడు చెప్పిన కథ మీకు అర్థమైందా. మీ కోడలు నిజంగా మంచిది కాదు అనుకోండి ఆ కోడలే మీ ఇంటికి రావటం ఏమిటి, ఇంక దేశంలో కొంపలు లేవా? అంటే మీరు చేసిన కర్మ ఆ కోడలిని తీసుకొని వచ్చింది అని మర్చిపోకండి, ఆ కోడలు తప్పేమీ లేదు, మీ కర్మే ఆ కోడలు రూపంలో వచ్చింది, అంతే. ఒకవేళ మీ కోడలు మంచిది అనుకోండి, మీ కర్మే ఆ మంచికోడలిని తీసుకొని వచ్చింది. ఇది మీరు అర్థం చేసుకొంటే 90% దుఃఖం తగ్గిపోతుంది. నువ్వు చేసిన కర్మ అది అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను వెంటాడుతుంది, అనుభవానికి వచ్చాక అది పోతుంది. నువ్వు కర్మ చేసావా అనుభవించక తప్పదు. ఈలోపుగా మీకు జ్ఞానం వస్తే నేను కర్మ అనుభవిస్తున్నాను అనేవాడు అక్కడ ఉండడు, అప్పడు కర్మ అనుభవిస్తున్నా, నేను అనుభవిస్తున్నాను అనే భావన మీకు రాదు, అదీ జ్ఞానం యొక్క వైభవం. నువ్వు ఏ పని చేస్తున్నా, ఏది మాట్లాడుతున్నా నీ దృష్టి అంతా కూడా ఆత్మజ్ఞానం వైపు ఉండాలి.

నరుడిలో ఉన్న నారాయణుడిని మనం చూడలేకపోతున్నాము. మరి ఎక్కడో ఒకచోట చూడాలి కదా అందుచేత గుడులచుట్టూ తిరుగుతున్నాము. నువ్వు గుడికి వెళ్ళి దేవుడిని చూడవచ్చు, అది రెండో పక్షం. ఆ మనిషికి ఉపకారం చేసాను, ఈ మనిషికి ఉపకారం చేసాను అనుకోవద్దు. నువ్వు మనిషిలో ఉన్న దేవుడిని చూసి, దేవుడినే

ఆరాధిస్తున్నాను అనే భావనతో చేస్తే అది మొదటి రకం భక్తి. లక్ష్మీనర్సింహస్వామి హిరణ్యకశిపుడిని సంహరించాక ప్రహ్లాదుడిని అడుగుతాడు నీ భక్తికి సంతోషించాను నీకేమికావాలో కోరుకో ఇస్తాను అంటాడు. మీరు దర్శనమిచ్చారు అంతకంటే నాకు ఏమికావాలి. నీకు ఏమైనా కావాలా అడుగు ఇస్తాను అంటున్నారు. అడగటానికి మీకంటే మించినదికాని, మీతో సమానమైనదికాని ఏమైనా ఉందా? ఏదో ఒకటి అడగటానికి ఇది ఏమైనా వ్యాపారమా అంటాడు ప్రహ్లాదుడు. భక్తి అంటే వ్యాపారమా. భగవంతుడిపట్ల ప్రహ్లాదుడికి ఉన్న భక్తి అటువంటిది, ప్రేమ అటువంటిది. అది స్వచ్ఛమైన భక్తి, పవిత్రమైన ప్రేమ. అందుచేత ప్రహ్లాదుడికి భక్తులలో అగ్రస్థానం ఇచ్చారు. మన జీవితంలో రోజులు గడిచేకొలది మృత్యువు దగ్గర అవుతున్నాము. అందుచేత కాలాన్ని వృధాచేసుకోవద్దు. డబ్బుపోతే సంపాదించుకోగలముకాని జరిగిపోయిన కాలం తిరిగిరాదు. అందుచేత కాలాన్ని మేగ్జిమమ్ సద్వినియోగం చేసుకొంటూ భగవంతుడికి దగ్గర అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. మనం ఎండిపోయిన పుల్లలలాగ, బండరాళ్ళలాగ తయారవుతున్నాము, మనకు రసహృదయం లేదు. ఈశ్వరుడిపట్ల మనకు ఉన్న భక్తి వలన, ఆయనపట్ల మనకు ఉన్న విశ్వాసం వలన ఆయన ఒక గిఫ్టు కింద మనకు రసహృదయం ఇస్తాడు అంతవరకూ మనకు రసహృదయం రాదు. రసహృదయం రాకుండా ఆయన అనుగ్రహం మనకు రాదు.

మనం భగవదనుభవం పొందటానికి చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి ఉండాలి, మెకానికల్‌గా చేయకూడదు. మీరు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తూ ఉంటే మీకు భగవదనుభవం కలుగుతుంది. బయట కారణాల వలన నీకు దుఃఖం రావటంలేదు. కర్తృత్వం వలనే నీకు దుఃఖం వస్తోంది. కర్తృత్వం పోతే దుఃఖం రాదు. ఆ స్థితికి మిమ్మల్ని మేల్కొలప టానికే ఈ బోధ అంతా. ఈ శరీరం భూమిమీద తిరుగాడుతున్నప్పుడే భగవదనుభవం, ఆనందానుభవం నీకు కలుగజేయటానికే భగవాన్ బోధ. భగవాన్ ఏమన్నారు అంటే మాకు ఆత్మజ్ఞానం ఇచ్చేయండి, ఆత్మజ్ఞానం ఇచ్చేయండి అని అడుగుతున్నారు, మీకు ఆత్మజ్ఞానం ఇచ్చేస్తాము అనుకోండి చిన్న గుడిసెలోనికి ఏనుగును తోలితే ఏమౌతుంది అన్నారు, గుడిసె అంతా పడిపోతుంది. మీరు కంగారుపడుతున్నారు అని నేను కంగారుపడితే అంతే అని చెప్పారు. భగవంతుడు నెమ్మదిగా చేస్తాడు. మీరు చేసే ప్రయత్నం సిన్సియర్‌గా ఉండాలి. మీ విశ్వాసం నిజమైతే మీరు ఒక్క అడుగు వేస్తే మీకోసం ఆయన తొమ్మిది అడుగులు వేసి ఎదరకు వస్తాడు. ఈశ్వరానుగ్రహం ఎప్పుడూ ఉంది కాని మనం దానిని అందుకోలేక పోతున్నాము, దానిని అందుకొనే యోగ్యత పొందటమే మన సాధన యొక్క గమ్యం. మీరు

ఆత్మవిశ్వాసం విడిచిపెట్టవద్దు. మీరు చేసే సాధన మీద మీకు ఉన్న నమ్మకం విడిచిపెట్టవద్దు. ఏదో ఎల్లమ్మ అందని, పుల్లమ్మ అందని రకరకాల గొడవలలోనికి వెళ్ళవద్దు. ఎల్లమ్మ, పుల్లమ్మ మీకు మోక్షం ఇవ్వరు. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే మనకు మోక్షం ఇస్తాడు. అందుచేత మీ నిదానంలో మీరు ఉండండి. మీరు స్లోగా, స్టడీగా ప్రయత్నం చేయండి, గమ్యాన్ని మర్చిపోవద్దు. మనం మనస్సు అనే జైలులో ఉన్నాము, అది ఎలా చెపితే అలా చేయటానికి అలవాటు పడిపోయాము. ఇలా మనస్సుకు పాలేరుతనం చేస్తూ ఏదోరోజున చనిపోతున్నాము. ఈ మనస్సు అనే జైలునుండి బయటకు వస్తే నువ్వు ఈ ప్రకృతిని దాటిపోతావు, అప్పుడు నీకు నిజమైన స్వేచ్ఛ, నిజమైన ఆనందం కలుగుతుంది. మనస్సును దాటి బయటకు వస్తే నువ్వు పదిలక్షల మంది మధ్యలో ఉన్నా ఒంటరిగా ఉన్నాను అనిపిస్తుంది. మనస్సు నుండి బయటకు రాకుండా నువ్వు గదిలో కూర్చుని తలుపులు వేసుకొన్నా నీ బుర్రనిండా అడివి మిగులుతుంది. అందుచేత మనస్సు అనే జైలునుండి బయటకు రావటానికి సిన్సియర్‌గా ప్రయత్నం చెయ్యి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-04-2009, మండపేట)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆంజనేయస్వామి అఖండ బ్రహ్మచారి, మహామేధావి, బుద్ధిమంతుడు, బలవంతుడు, వ్యాకరణ శాస్త్రవేత్త. ఆయనకు వ్యాకరణశాస్త్రంలో ఉన్న పరిజ్ఞానం చూసి రాముడు ఆశ్చర్యపోయాడు. ఆంజనేయస్వామిలో మనం నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. రామనామాన్ని ఆంజనేయస్వామి ప్రచారం చేసినంతగా ఎవరూ చేయలేదు. ఆంజనేయస్వామికి దేవుడి పని తప్పించి సొంతపని అంటూ ఏమీ లేదు. అహంకారాన్ని పోగొట్టుకోవటం తేలిక అని మీరు అనుకుంటున్నారు కాని అది మీరు అనుకున్నంత తేలిక కాదు. కుక్క తోక వంకర తీయటం ఎంత కష్టమో అహంకారాన్ని పోగొట్టుకోవటం అంత కష్టం అని రామకృష్ణ పరమహంస చెప్పారు. మనకి అహంకారం ఒకోసారి అణిగి ఉంటుంది. అప్పుడు అహంకారంలోంచి బయటకు వచ్చేసాము అని మనకి అనిపిస్తుంది. ఇలా అనుకొంటూ మనలను మనం మోసం చేసుకొంటున్నాము. అహంకారం భయంకరమైన క్రూర సర్పము అన్నారు ఆచార్యులవారు. ఒక మహాసర్పము వచ్చి మీ శరీరాన్ని చుట్టబెట్టుకుంటే మీరు దానిలో నుండి బయటకు రాగలరుకాని అహంకారంలో నుండి బయటకు రాలేరు అని చెప్పారు. కోరిక, కోపము, లోభిత్వము ఇవి నిన్ను చంపక ముందే వాటిని చంపేయి